ఉపాధికి వెళ్తేనే 'ఆత్మీయ భరోసా'

- భూమిలేని కూలీలకు ప్రయోజనం
- 20 రోజుల పని నిబంధన తొలగించాలని వినతి
- ప్రతి గ్రామంలో ఉపాధి పనులపై ఆసక్తి

మండలాల వారీగా..

మండలం	జీపీలు	దరఖాస్తులు	ఎంపికైన వారు
పాన్‌గల్	28	715	317
చిన్నంబావి	17	1057	848
వీపనగండ్ల	14	707	638


తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పాన్‌గల్: మండల వ్యాప్తంగా ప్రజాపాలన గ్రామ సభలు ముగిశాయి. సదరు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఇటీవల గ్రామాల వారీగా చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లో 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంలో అర్హులకు లబ్ధి చేకూరకుండా అనర్హుల పేర్లు జాబితాలో వచ్చాయని పలు గ్రామాల కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. జాబితాలో చోటు దక్కని వారి నుంచి తిరిగి దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న భూమి లేని పేద వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ పథకానికి అర్హులను గుర్తించడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టి తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉపాధి హామీ కూలీల వివరాల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టి అర్హులైన వారిని గుర్తించి తొలి విడతలో ప్రభుత్వం రూ. 6 వేలు కూలీల ఖాతాల్లో జమ చేయనుంది.

లబ్ధిదారుల ఎంపిక..

2023–24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజుల ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన వారినే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆధార్‌కార్డు అనుసంధానం కాని వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ చేపడుతున్నారు. జాబ్‌కార్డులో ఆధార్ నెంబర్ లింక్ కానటువంటి ఉపాధిహామీ కూలీల ఆధార్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ, సెల్ నంబర్లతో పాటు లబ్ధిదారుల్లో ఎవరైనా మరణించిన వారు ఉంటే వారి వివరాలను తొలగించి ఆన్‌లైన్ నమోదు పూర్తి చేస్తున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. వీరికి ఒక్కగుంట కూడా సాగు భూమి ఉండకూడదు. భూమిలేని వ్యవసాయ కూలీలే ఈ పథకానికి అర్హులు.


ఆత్మీయ భరోసా పథకం నిబంధనల గురించి వివరిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి (ఫైల్)

ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తాం



ఆత్మీయ భరోసా జాబితాల్లో అనర్హుల పేర్లు ఉంటే ఫిర్యాదు చేస్తే విచారణ నిర్వహించి తొలగిస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే లబ్ధిదారుల జాబితాను రూపొందించాం. అనర్హులు ఉంటే ఆయా వివరాలను గ్రామాల్లో విచారణ చేస్తాం. అర్హులు అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

పని నిబంధన తొలగించాలి



ప్రభుత్వం భూమి లేని కూలీలకు అందించనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 20 ఉపాధి పనులు చేసి ఉండాలన్న నిబంధన తొలగించాలి. భూమి లేని పేద కూలీలకు ఈ పథకం వర్తింపజేయాలి. చాలా గ్రామాల్లో భూమి ఉన్న ఉపాధి కూలీల పేర్లు కూడా లిస్టులో వచ్చి, భూమి లేని కూలీలకు చాలా మంది పేర్లు రాలేదు. అలాంటి వాటిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి అర్హులైన కూలీలకు న్యాయం చేయాలి.

– సూర్యవంశ రాము, సీఐటీయూ జిల్లా నాయకులు, బుసిరెడ్డిపల్లి

సెంటు భూమి లేకున్నా..



నాకు సెంట్ భూమి లేకున్నా ప్రభుత్వం ఇటీవల గ్రామసభల్లో సంక్షేమ పథకాలకు అర్హుల పేర్లను ప్రకటించిన జాబితాలో నా పేరు రాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 రోజులు పని చేసిన, భూమి లేకపోయినా నన్ను లబ్ధిదారురాలిగా ఎంపిక చేయలేదు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకున్నా. తమ లాంటి పేద వారిని గుర్తించి సంక్షేమ పథకం వర్తింపజేయాలి.

– సీరడి పార్వతమ్మ, ఉపాధి కూలీ, రేమద్దుల

క్లుప్తంగా

పప్పు దినుసుల సాగుపై అవగాహన



పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం–వీడియో కాన్ఫరెన్స్‌లో వేసవిలో పప్పు దినుసుల సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించినట్లు ఏఓ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వేసవి పప్పు దినుసుల సాగుపై వీడియో ప్రదర్శన, శాస్త్రవేత్తల ఉపన్యాసం, అభ్యుదయ రైతుల అనుభవాలు, వ్యవసాయ మౌలిక వనరుల నిధిపై ఉపన్యాసం, రైతులకు సూచనలు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు వ్యవసాయంలో తాజా సాంకేతికతలు, అనుభవాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినికి సన్మానం



కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన ప్రత్యూష ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న సందర్భంగా ఆమెను బీజేపీ మండల నాయకులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థినిని ఆశీర్వదిస్తూ భవిష్యత్‌లో ఆమె మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన ఈ ప్రోత్సాహం వారి స్వప్నాలను సాకారం చేసుకునేందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భరత్ భూషణ్, వాకిటి రాజమౌళి, బాలు తదితరులు పాల్గొని ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రహదారి పనులకు భూమిపూజ



అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో మంగళవారం రూ.15 లక్షల విలువ గల సీసీ రహదారి పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించినట్లు మాజీ సర్పంచ్ వెంకటయ్య తెలిపారు. గ్రామంలో సీసీ రహదారులు అధ్వానంగా ఉన్నాయని తెలిసి ఎమ్మెల్యే తన నిధులతో రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రహదారులతో పాటు బీటీ వసతి లేని కచ్చ రహదారులకు బీటీ కోసం నిధులు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తౌఫిక్, అస్సూ, పాషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి అదృశ్యం


కృష్ణయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: పారిశుద్ధ్య కార్మికుడు రెండు వారాల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కృష్ణయ్య (35) సంక్రాంతి పండగ మరుసటి రోజు పని ఉందని ఇంట్లో చెప్పి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. మంగళవారం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కృష్ణయ్యకు భార్యతో స్వాతి, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏదులలో ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభం

గోపాల్‌పేట: ఏదుల మండల ఎంపీడీఓ కార్యాలయం మంగళవారం జెడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్ రెడ్డి, ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ప్రారంభించారు. దీంతో ఏళ్లుగా మండలం ఏర్పాటు కోసం ఎదురుచూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. వనపర్తి ఎంపీఓ రవీందర్‌బాబుకు ఏదుల మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బధ్యతలు అప్పగించారు. తొందర్లోనే పోలీస్‌స్టేషన్, ఇతర కార్యాలయాలు ప్రారంభం అవుతాయని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో గోపాల్‌పేట ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏదుల తహసీల్దార్ మల్లికార్జున్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌యాదవ్, సుఖేందర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాంచందర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: గురుకుల, నవోదయ, సైనిక్ పాఠశాలల్లో చేరేందుకు ఉచిత శిక్షణ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జా అన్వర్‌బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ కోరారు. ఫిబ్రవరి 5వ తేదీన 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష జరుగనుందని పరీక్షలకు సిద్ధమవుతున్న దివ్యాంగులు, అనాథలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 94415 91776, 80198 29211 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మద్యం మత్తులో మహిళపై అత్యాచార యత్నం

ఖిల్లాఘనపురం: మద్యం మత్తులో ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసునమోదు చేసిన ఘటన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గార్లబండతండాకు చెందిన ఓ మహిళ తన భర్తతో కలిసి ఈ నెల 21 రాత్రి భోజనం ముగించుకుని పడుకున్నారు. మధ్యరాత్రి సుమారు 2గంటల సమయంలో ఎవరో తలుపు కొట్టినట్లు వినిపించడంతో మహిళ తలుపు తీసి చూసింది. ఇంటి ముందు ఆముదంబండతండాకు చెందిన ఇస్లావత్ గోపాల్ కనిపించాడు. మద్యం మత్తులో ఉన్న అతడు మహిళపై అత్యాచారయత్నం చేశాడు. బాధిత మహిళ కేకలు వేయడంతో భర్త వచ్చి గోపాల్‌ను పట్టుకునేందుకు యత్నించగా.. నిందితుడు పారిపోయాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు తండావాసులకు చెప్పి పంచాయతీ మాట్లాడటానికి పిలిపించారు. ఎంతకు రాకపోవడంతో మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఆత్మకూర్‌లో క్రికెట్ పొటీలను ప్రారంభిస్తున్న అశ్వినీకుమార్

కొత్తకోట రూరల్: క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కొత్తకోట శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ జయంతిని పురస్కరించుకొని ఖేల్ ఉత్సవ్ పేరుతో పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి ఆటపోటీలను స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి యువకుడు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పిల్లలు, యువకులు చెడుదారిలో వెళ్లకుండా.. ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన భారతీయ విద్యామందిర్ జట్టు మొదటి స్థానంలో నిలవగా, అమడబాకుల జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఖోఖో మొదటి స్థానంలో జెడ్పీహెచ్ఎస్ అమడబాకుల, ద్వితీయ స్థానంలో భారతీయ విద్యామందిర్ స్కూల్ విద్యార్థులు నిలవగా.. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్, పూర్వ జిల్లా కన్వీనర్ ఎం.అజయ్‌కుమార్, ఖేల్ కన్వీనర్ ఓమేష్, పవన్, శివ, ప్రధాన చార్యులు రాజేశ్వరి మాతాజీ, ఫిజికల్ డైరెక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆత్మకూర్: వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆత్మకూర్‌లో బీజేపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ ప్రారంభించారు. మొదటి విజేత జట్టుకు రూ.10 వేలు నగదును బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, రెండో బహుమతి కొత్తూరు నర్సింహ రూ.5 వేల నగదును అందించనున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తమ్మలి విజయ్, ఆనంద్, నర్సింహ, సూరి, డాన్స్ మాస్టర్ బాలు, కురుమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

'స్థాయికి మించిన ప్రకటనలు మానుకోండి'

కొత్తకోట: బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందని, ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను ఎగతాళి చేసి మాట్లాడటం సరికాదని, కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని మించిన ప్రకటనలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నారామణ్ అయ్యన్న అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి 14 నెలలు అయ్యిందని, కొత్తకోట మున్సిపాలిటీకి ఇప్పటి వరకు ఆయన ఏం చేశారో చెప్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తెచ్చిన నిధులతో శంకుస్థాపన చేసిన శిలాఫలకాల వద్ద కాంగ్రెస్ నాయకులు మళ్లీ టెంకాయలు కొట్టడం చేతకాని పని అన్నారు. రవీందర్‌రెడ్డి, రాములు, ఖాజామైనోద్దీన్, సాజీద్ అలీ, వినోద్‌సాగర్, శ్రీను, వసీం పాల్గొన్నారు.

క్రికెటర్‌కు చేయూత



గోపాల్‌పేట: నేపాల్‌లో ఫిబ్రవరి 14 నుంచి 18 వరకు జరుగబోయే జాతీయ డిజెబుల్డ్ క్రికెట్‌లో ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించే కేబీ ప్రభాకర్‌కు షైన్ ఏ లైఫ్ ఎన్‌జీఓ సంస్థ అండగా నిలిచింది. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన కేబీ ప్రభాకర్ అంతర్జాతీయ డిజెబుల్ క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడని సోమవారం సాక్షిలో ప్రచురించిన కథనాన్ని చూసిన షైన్ ఏ లైఫ్ ఎన్‌జీఓ సంస్థ ఫౌండర్ బాదగొని మానసగౌడ్ క్రీడాకారుడు ప్రభాకర్‌ను అభినందించారు. మంగళవారం ప్రభాకర్‌ను తాడిపర్తికి పిలిపించుకుని తక్షణ ఆర్థికసాయంగా రూ.50వేల నగదు, రూ.25వేల విలువ చేసే ప్రొఫెషనల్ క్రికెట్ కిట్టు అందించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించి గోపాల్‌పేటకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని వారి సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభాకర్ తండ్రి బెంజిమెన్, స్నేహితులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైయినేజీ గుంత


వనపర్తి రోడ్డులో రక్షణ లేని డ్రైయినేజీ

కొత్తకోట: మున్సిపాలిటీలో డ్రైయినేజీ వ్యవస్థ దయనీయంగా మారింది. పట్టణంలోని వనపర్తి రహదారిలో రాహుల్ ఆస్పత్రి సమీపాన ఉన్న డ్రైయినేజీ ప్రమాదకరంగా ఉంది. దీనిపై ఎలాంటి సీసీ దిమ్మెలు, చుట్టు కంచె ఏర్పాటు చేయకపోవడం వల్ల అటువైపు వేళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక ఈ దారిలో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా అందులో జారిపడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పట్టణానికి చెందిన శివ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఈ డ్రైయినేజీలో పడి ప్రమాదానికి గురయ్యాడు. అంతేకాక మూగ జీవాలు సైతం ఈ డ్రైయినేజీలో పడి గాయాలబారిన పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదకరంగా ఉన్న డ్రైయినేజీ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ రావడం హర్షణీయం


మాట్లాడుతున్న దళిత నాయకులు

పెబ్బేరు రూరల్: మందకృష్ణ మాదిగ దళితుల అభ్యున్నతి కోసం చేసిన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడంపై పెబ్బేరు దళిత నాయకుల అధ్యక్షుడు రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం దళిత నాయకుల ఆధ్వర్యంలో పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మందకృష్ణ దళిత జాతుల కోసం 1994లో దండోరా ఉద్యమాన్ని స్థాపించి, వారం సంక్షేమ కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు అందిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, ఎద్దుల సాయినాథ్, మాలెపల్లి మన్నెం, మధు, గోపిబాబు, మొగులన్న, సురేష్ బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు


అమరచింత: మండలంలోని చింతరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 సంక్షేమ పథకాలను మండలంలోని చింతరెడ్డిపల్లిలో అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతు భరోసాతో పాటు ఆత్మీయ భరోసా ద్వారా లబ్ధిదారులకు డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలి


ప్రయాణికుల ఫోన్ కాల్‌కు స్పందిస్తున్న ఆర్టీసీ డిపో అధికారులు

వనపర్తిటౌన్: ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలు అందించాల్సిన అవసరం ఉందని 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు విజ్ఞప్తులు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఆర్టీసీ డిపో డీఎంతో ఫోన్‌లో ప్రయాణికులు రవాణా పరంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఆర్టీసీ అధికారులు కొన్ని బస్సుల సమయాలను మార్చాలని, రెగ్యులర్‌గా ప్రయాణికుల రాకపోకలు సాగించే ప్రాంతాల్లో బస్సులు ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేటలో గల బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బెంగళూర్ వెళ్లే బస్సులను కొత్తకోట మీదుగా నడపడం ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి వనపర్తికి రాత్రి 11 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తిరిగి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు అనుగుణంగా ఉంటుందన్నారు. వనపర్తి వయా మల్లాయిపల్లి మీదుగా పెబ్బేర్‌కు షటిల్ బస్సు నడపాలని, కర్నూల్ రూట్‌లో వేముల దగ్గర ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని కోరారు. కొన్నూర్, కొంకుంట్ల, దేవరకద్ర, కొత్తకోట, మీదుగా బస్సులు అందుబాటులోకి తేవాలని, ఆత్మకూర్, మరికల్ బస్సుల సమయం మార్చాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. వనపర్తి, పాన్‌గల్, జమ్మాపూర్, పొంగచర్ల మీదుగా పెబ్బేర్‌కు ఉదయం, సాయంత్రం బస్సు వేయాలని కోరారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రయాణికులు విజ్ఞప్తులను పరిశీలించి, సాధ్యమైనంత వరకు అందిరికీ ఆమోదయోగ్యంగా ఉండే నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసన



వనపర్తి రూరల్: హైదరాబాద్‌లోని మీర్‌పేటకు చెందిన గురుమూర్తి అతడి భార్య వెంకటమాధవిని ముక్కలుగా నరికి హత్య చేయడం దారుణమని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సంఘం సభ్యులు కళ్లకు నల్ల గంతలు కట్టుకొని, ప్లకార్డులు ధరించి మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, ప్రధాన కార్యదర్శి గీత, పట్టణ కన్వీనర్ జయమ్మ, భూమిక, శిరీష, అంజనమ్మ, అలివేల, వెంకట్రమణమ్మ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం

పాన్‌గల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా 30 ఏళ్లుగా పోరాడుతున్న మందకృష్ణ మాదిగ ఇచ్చిన లక్ష డప్పులు, వేయి గొంతుకలు కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోఆర్డినేటర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ డప్పుస్వామి ఆధ్వర్యంలో కళా బృందం చేపట్టిన యాత్ర మంగళవారం సాయంత్రం మండలంలోని కేతేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ అంబేడ్కర్ యూత్ సభ్యులు ఘన స్వాగతం పలికి కళా బృందం సభ్యులను సన్మానించారు.

జీటీఏ డైరీ ఆవిష్కరణ

కొత్తకోట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం 2025 డైరీ, క్యాలెండర్లను మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తకోట ప్రధానోపాధ్యాయుడు వివేకానంద్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్ ఆవిష్కరించారు. ప్రవీణ్‌రెడ్డి, కేశవాచారి, సత్యనారాయణ, రమేష్, విజయలక్ష్మి, పద్మావతి, రవికుమార్, సుధారాణి, వెంకటేష్, నాజిమా, అక్షయ్ పాల్గొన్నారు

శివాలయంలో మాస శివరాత్రి పూజలు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి శివారులోని వైరాలగుట్టలో వెలసిన శివాలయంలో భక్తులు మాస శివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు, శివ మాలధారులకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు పాన్‌గల్‌కు చెందిన ఆర్ఎంపీ రామకృష్ణ, మనీష దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. పూజల్లో మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నాగేంద్రంసాగర్, యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శీలయ్యగౌడ్, జగదీశ్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, పద్మ, నాగరాజు, మాలధారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


వనపర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్, విద్యార్థి సంఘం నాయకుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిలోగా రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 13 నెలల దాటినా 53 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

అమరచింత: చదువులో వెనకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగంధర్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో 4, 5వ తరగతి విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ ప్రకారం బోధన చేయాలని, వర్క్‌బుక్స్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు చేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖిల్లాఘనపురం: జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, భాస్కర్, సాయికృష్ణ, భీమ్‌రాజ్, వెంకటేష్, రంగమ్మ, ప్రియాంక, పద్మ, సంగీత తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు